క్లుప్తంగా

బాల్యవివాహాలపై అవగాహన

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో గురువారం బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా బాలల పరిరక్షణ అధికారి సగ్గం రాజు మాట్లాడుతూ వివాహ వయసు వచ్చే వరకు బాలికలకు మంచి చదువు చెప్పించాలన్నారు. ఏఎస్సై గంగారాం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, ప్రధానోపాధ్యాయులు వినోద్‌కుమార్, అధికారులు కరుణశ్రీ, శైలజ తదితరులు ఉన్నారు.

కేజీబీవీలో వైద్య శిబిరం



విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యాధికారి శ్రీకాంత్

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని కేజీబీవీలో గురువారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి శ్రీకాంత్.. విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం వ్యాయామం చేస్తూ పరిశుభ్రత పాటిస్తే చురుకుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో నవిత, సిబ్బంది సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

లోకేశ్వరం: మండలంలోని వివిధ గ్రామాలకు జెడ్పీ నిధులు మంజూరు చేశారని జెడ్పీటీసీ లోలం కళావతి ఒక ప్రకటనలో తెలిపారు. అబ్దుల్లాపూర్, కన్కపూర్, సేవాలాల్‌తండాలో మూడు సైడ్ డ్రెయినేజీల నిర్మాణం కోసం రూ.రెండు లక్షల చొప్పున మొత్తం రూ.ఆరు లక్షలు, మన్మద్‌లో బీసీ, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.రెండు లక్షలు, నర్సింహ నగర్‌తండాలో సైడ్ డ్రెయినేజీ కోసం రూ.2.50 లక్షలు, జోహర్‌పూర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.రెండు లక్షలు మంజూరయ్యాయని.. త్వరలో పనులు ప్రారంభిస్తామని వారు పేర్కొన్నారు.

దుకాణాలు తొలగింపు



దుకాణాలను తొలగింపజేస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: నిబంధనలకు విరుద్ధంగా జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్, బుధవార్‌పేట్, చింతకుంటవాడ రోడ్లపై ఏర్పాటు చేసుకున్న తోపుడుబండ్లు, వివిధ రకాల దుకాణాలను గురువారం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ఈసందర్భంగా ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్ మాట్లాడారు.

సెగ్రిగేషన్ షెడ్డు పరిశీలన



షెడ్డు పరిశీలిస్తున్న ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి

కుంటాల: మండలంలోని మెదన్‌పూర్‌లో సెగ్రిగేషన్ షెడ్డు, బృహత్ పల్లె ప్రకృతి వనం, నర్సరీ, వైకుంఠధామాన్ని గురువారం ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట సర్పంచ్ చంద్రకాంత్‌పటేల్, కార్యదర్శి దేవన్న తదితరులు ఉన్నారు.

గర్భిణులకు సీమంతం



సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

ఖానాపూర్: మూడు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని అంగన్‌వాడీ టీచర్ ఆర్.విజయలక్ష్మి కోరారు. గురువారం పట్టణంలోని రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీడీ విజయలక్ష్మి, సీడీపీవో సరిత, సూపర్‌వైజర్ నిర్మల ఆదేశాల మేరకు కేంద్రానికి వచ్చే లబ్ధిదారులకు పోషకాహారం అందిస్తూ సీమంతాలు, అక్షరాభ్యాసాలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

భూమిపూజ

ఖానాపూర్: మండలంలోని దిలావార్‌పూర్ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద గురువారం వంటశాల నిర్మాణానికి గౌడ సంఘం ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ఎమ్మెల్యే రేఖానాయక్ ఇటీవల మంజూరు చేసిన రూ.రెండు లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో చెక్కిల్ల భూమాగౌడ్, గుగ్గిల్ల సంతోశ్‌గౌడ్, చెక్కిల్ల రాజేశ్వర్‌గౌడ్, గుగ్గిల్ల రాజేశ్వర్‌గౌడ్, బత్తిని శేఖర్‌గౌడ్, బుచ్చాగౌడ్ తదితరులున్నారు.

సమస్యల్లో సంక్షేమ హాస్టల్



తరగతి గదిలోనే విద్యార్థుల చదువు, వసతి



అందరికీ ఇదే వాష్ ఏరియా

జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల సమస్యలకు నిలయంగా మారింది. నాలుగు అంతస్తుల అద్దె భవనంలో దాదాపు 450 నుంచి 500 మంది విద్యార్థులు చదువుతున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో వంటరూం, డైనింగ్ హాల్, మొదటి అంతస్తులో స్టాఫ్‌రూం, ల్యాబ్‌లు, స్టోర్‌రూం ఉన్నాయి. రెండు, మూడు, నాలుగో అంతస్తుల్లో ఉన్న 18 గదుల్లో విద్యార్థులు ఉంటున్నారు. ఒక్కో గదిలో 30 మంది వరకు ఉంటున్నామని.. తరగతి గదిలోనే పాఠాలు వింటూ అక్కడే పడుకుంటున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనవరి 26న తాగునీరు కలుషితమై 50 మంది విద్యార్థులు సిక్ అయ్యారు. కళాశాల భవనం చుట్టూ మురికి నీరు చేరిందని.. కలెక్టర్ స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



ఇబ్బంది పడుతూ చదువుతున్న విద్యార్థులు, పక్కనే సామగ్రి



మహిళా డిగ్రీ కళాశాల భవనం



అపరిశుభ్రంగా తాగునీటి ట్యాంక్

వార్షికోత్సవానికి వేళాయె..

- ముస్తాబైన ముత్యాల పోచమ్మ ఆలయం
- ఈనెల 11 నుంచి 13 వరకు ఉత్సవాలు

ఖానాపూర్: భక్తుల కొంగు బంగారంగా పేరుగాంచిన ముత్యాల పోచమ్మ ఆలయ వార్షిక ఉత్సవాలు ఏటా వైభవంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని శాంతినగర్ కాలనీ పోచమ్మ ఆలయ 17వ వార్షికోత్సవం ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు జరిపేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణం, పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. పుష్య అమావాస్య నుంచి మాఘ శుద్ధపౌర్ణమి వరకు జరిగే చలిబోనాల పండుగను ప్రతీ ఆది, గురువారాల్లో నిర్వహిస్తారు. దీంతో కొద్ది రోజులుగా భక్తులు పోచమ్మకు బోనాలు సమర్పిస్తుండటంతో పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పండితులు మనోహర శర్మ, వాసుదేవాచార్యులు, అర్చకులు నిమ్మగడ్డ శరత్‌చంద్ర శర్మ బృందం ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కళాసమాఖ్య ఆధ్వర్యంలో సాంస్కృతిక, భజనలు చేపట్టనున్నారు.

మూడు రోజుల పాటు ఉత్సవాలు..

ఈనెల 11న మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, గోపూజ పంచగవ్యప్రాశనం వరుణయానం(గంగ తెప్ప), రక్షబంధనం, రుత్విక్ వరణం, మహాశక్తిన్యాస, పూర్వక శతౌషధియుక్త మహాబలాభిషేకం (భక్తులచే అమ్మవారికి జలాభిషేకం), యాగశాల



ఆలయంలో అమ్మవారు

ప్రవేశం, అఖండ దీపస్థాపన, కర్కరి, వాస్తు నవగ్రహ యోగిని, క్షేత్రపాలక సర్వతోభద్ర మండల స్థాపనం, ప్రధాన కలశ స్థాపనం, అమ్మవారి ఆభరణాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తారు.

రెండో రోజు అమ్మవారి ప్రతిమ ఊరేగింపు, పోతరాజుల విన్యాసం..

12న అమ్మవారి మూల విగ్రహానికి విశేష క్షీరాభిషేకం, నిత్య అర్చన మూలమంత్ర హవనం, శిలా స్థాపిత దేవతార్చనలు, స్వాతినక్షత్రయుక్త మీన లగ్న సుముహూర్తమున శిలా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, మహిళల సామూహిక కుంకుమార్చనతోపాటు రాత్రికి శ్రీముత్యాల పోచమ్మ అమ్మవారి ఉత్సవ మూర్తి ఊరేగింపు, పోతరాజుల విన్యాసాలు, మహాశక్తిన్యాస షడామ్నాయ ప్రయోగం, అష్టభైరవ బలి మహానైవేద్యం వంటి కార్యక్రమాలు ఉంటాయి.

చివరి రోజు సదర్ బోనాలు, జాతర

13న అమ్మవారి మూల విగ్రహానికి విశేషక్షీరాభిషేకం, పుష్పాలంకరణ, మూల మంత్ర సహిత, మహాచండీ సప్తశతి హవనం(చండీయాగం), దిక్పాలక ప్రకారబలి, మహాపూర్ణాహుతి, అమ్మవారి విశ్వరూప సందర్శనం, శ్రీముత్యాల పోచమ్మ–దేశపతిరాజుల శాంతి కల్యాణం, మహాపట్నం, నాగవెల్లి, సదర్ బోనాల ఊరేగింపు, భక్తులకు అమ్మవారికి మహాపాయసం అందడంతోపాటు జాతర నిర్వహించనున్నారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

ఖానాపూర్: వార్షికోత్సవం నేపథ్యంలో పట్టణంలోని శాంతినగర్ కాలనీ ముత్యాల పోచమ్మ ఆలయ పరిసరాల్లో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పరిశీలించారు. అంతకముందు ఎమ్మెల్యే నివాసంలో టీజీవో జిల్లా అధ్యక్షులు అజ్మీరా శ్యాంనాయక్‌కు ఉత్సవాలకు రావాలని కోరుతూ ఆహ్వానపత్రిక అందించారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు నాగేందర్‌రావు, రంజిత్‌రావు, రమేశ్, నాగరాజు, రాజేశ్వర్, గంగనర్సయ్య తదితరులు ఉన్నారు.

ఊరూరా కొనసాగుతున్న ‘కంటివెలుగు’



ఓలాలో శిబిరం ప్రారంభిస్తున్న ఎంపీపీ గజ్జారాం



చాక్‌పల్లిలో శిబిరం ప్రారంభిస్తున్న నస్రీన్ బేగం



పేర్కపల్లెలో పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మి


తానూరు: మండలంలోని హంగిర్గా గ్రామంలో కంటివెలుగు వైద్య శిబిరాన్ని సర్పంచ్ బి.బాలాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని తహసీల్దార్ వెంకటరమణ పర్యవేక్షించారు. ప్రజలకు ఇబ్బందులకు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ అబ్దుల్ కాసీం, ఎంపీవో మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని ఓలాలో కంటివెలుగు శిబిరాన్ని ఎంపీపీ గజ్జారాం యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కనీష్ ఫాతిమా, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీటీసీ కట్ట రవి, వైద్యుడు దామోదర్, కార్యదర్శి సుమన్ పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ నస్రీన్‌బేగం ప్రారంభించారు. ఈనెల 13 వరకు శిబిరం ఉంటుందని.. అందరూ కంటిపరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ లక్ష్మి, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ వనజ, ఎంపీఓ శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి నరేశ్‌కుమార్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: మండలంలోని పేర్కపల్లెలో కంటివెలుగు వైద్యశిబిరాన్ని తహసీల్దార్ లక్ష్మి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈ శిబిరంలో 320 మందికి కంటి పరీక్షలు నిర్వహించి.. 80 మందికి కళ్లద్దాలు అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేంకటేశ్వర్లు, వైద్యాధికారి నాగరాజు, ఎంపీవో అనిల్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఆశవర్కర్లు భారతి, గోదావరి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు



కల్లూర్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నిర్మల్‌టౌన్: పట్టణ శివారులోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సింగిల్ ట్రస్ట్ చైర్మన్ లక్కడి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో నిర్మల్‌తో పాటు, చుట్టు పక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పూజారులు భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు.

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి కనిపించింది. నర్సాపూర్(జి), దిలావర్‌పూర్, లోకేశ్వరం, భైంసా, కుంటాల మండలాల మహిళలు ఆలయానికి పాదయాత్రగా వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

బీజేపీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

లక్ష్మణచాంద: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. పల్లె గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా గురువారం మండలకేంద్రంతోపాటు చామన్‌పెల్లి, చింతల్‌చాంద గ్రామాల్లో ఆయన పర్యటించి మాట్లాడారు. కేంద్రం ఇస్తున్న నిధులను తాము ఇస్తున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకోవడం సరికాదన్నారు. నిర్మల్ అసెంబ్లీ కన్వీనర్ మురళీ, మండల ఉపాధ్యక్షుడు రంజిత్, ప్రధాన కార్యదర్శి రాజు, గంగాధర్, నారాయణ, గోవర్ధన్, సాయితేజ, సురేశ్, అశోక్, రమేశ్, శ్రీనివాస్, కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. కుక్కల బెడదతో ఇక్కట్లు



ఖానాపూర్: పట్టణంలో ఊరకుక్కల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి రోడ్లపై వెళ్లేవారి వెంట పడుతూ దాడి చేసి గాయపరుస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కల బెడద నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రత్నాకర్‌రావు, మున్సిపల్ కమిషనర్, **ఫోన్:** 9440040793

మొక్కలపై శ్రద్ధ పెట్టాలి



కమల్‌కోట్‌లో నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీడీవో

మామడ: నర్సరీల్లో మొక్కల పెంపకంతో పాటు సంరక్షణపై శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని కమల్‌కోట్ గ్రామంలో నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	25

– నిర్మల్‌టౌన్

జయంత్యుత్సవాలు విజయవంతం చేయండి

నిర్మల్‌టౌన్: ఈనెల15న నిర్వహించే శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో గురువారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉత్సవాలు ఘనంగా జరుపుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు రూ.5 లక్షలు కేటాయించాలని కోరారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్రావు, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ అశోక్ నాయక్, జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ నాయక్, రోహిదాస్, బహుజన ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు సూర్యకాంత్ కాంబ్లే పాల్గొన్నారు.

సినిమాలు



తిరుమల : శివవేద
నారాయణ : అమిగోస్
వెంకటేష్ : వాల్తేరు వీరయ్య

మొగి పురుగుతో అప్రమత్తంగా ఉండాలి



పొలం పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి తిరుపతి

దస్తురాబాద్: వరి పొలానికి మొగి పురుగు సోకుతుందని.. రైతులంతా అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి తిరుపతి కోరారు. గురువారం మండల కేంద్రంలోని రైతుల వరి పొలాలను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. నాటు వేసినప్పటి నుంచే జాగ్రత్తలు పాటిస్తే పురుగును నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామంలోని వరి పంట ను గురువారం ఏవో సంధ్యారాణి పరిశీలించారు. అగ్గితెగులు, మొగిపురుగు సోకిన పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈవో షాలిని ఉన్నారు.

కంచారోని చెరువును అభివృద్ధి చేస్తాం

- మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్



చెరువు పరిశీలిస్తున్న చైర్మన్ ఈశ్వర్, కమిషనర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కంచారోని చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కంచారోని చెరువు ప్రాంతం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణవాసులకు ఆహ్లాదం పంచేలా బోటింగ్ సిస్టమ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. వారి వెంట కమిషనర్ సంపత్‌కుమార్, డీఈ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

ఈద్గా పనులు పరిశీలన

జిల్లా కేంద్రంలోని చించోలి(బి) శివారులో నిర్మించే ఈద్గా పనులను మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పరిశీలించారు. ఇచ్చిన హామీ మేరకు మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. వారి వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మరుగొండ రాము, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఆవిర్భావ వేడుకలు

భైంసాటౌన్: పట్టణంలోని సంఘ భవనంలో గురువారం పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బివి రమణారావు జెండా ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి.గజ్జారాం, సయ్యద్ అన్సర్, మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు, భైంసా మండల బాధ్యులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ముథోల్: మండలకేంద్రంలోని పాతబస్టాండ్ ఆవరణలో గురువారం హెచ్ఐవీ (ఎయిడ్స్)పై కళాజాత బృందం అవగాహన కల్పించారు. ఆదర్శ కళాబృందం లింగపల్లి రాజలింగు ఆధ్వర్యంలో కళాకారులు ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేందర్, మేనేజర్ మల్లికార్జున్, శశిమాల, సీఎల్‌డబ్ల్యూ సలీం, పలువురు బృంద సభ్యులు ఉన్నారు.

సన్మానం

కుంటాల: మండలంలోని లింబా(కె) ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు ఉపాధ్యాయునిగా పని చేస్తున్న జి.కృష్ణం రాజు బదిలీపై సిద్దిపేట జిల్లా కొమరవెల్లి ఉన్నత పాఠశాలకు వెళ్లారు. గురువారం ఆయనను సన్మానించారు. హెచ్ఎం సతీశ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.